


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3 సంచిక -116 శనివారం 10 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# ఎల్‌నినోపై సీఎం ఫోకస్

## 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం

**ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చ**

**ఇప్పటికే కేంద్రాన్ని రూ.20 వేల కోట్ల..**

**సాయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం**






**హైదరాబాద్, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కరువు ఛాయలు, చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. దీనిపై ఈ నెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై వారితో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్తు డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు.రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించడంతోపాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం ద్వారా విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరింది. మంత్రులతో నిర్వహించే సమావేశంలో వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై చర్చించే అవకాశముంది. రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై చర్చించే అవకాశముంది.

# భద్రతా వలయంలో ఢిల్లీ!



**సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు**

**ఢిల్లీలో 20 వేల మంది బలగాలతో కఠిన భద్రతా ఏర్పాట్లు**

**57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు**

**జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరణ**

**పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది.పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మిగతాది 2లో...






## కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా

# బీసీలకు 34% ఇస్తాం

**సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చంద్రబాబు ప్రకటన**

**ప్రతి రైతు సమస్య పరిష్కారమే మా లక్ష్యం**

**రాజముద్రతో 40 లక్షల పాస్‌పుస్తకాలిచ్చాం**

**ప్రకాశం జిల్లా సభలో సీఎం చంద్రబాబు**



**ఒంగోలు, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం కన్నా అధికంగానే సీట్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వారందరినీ గెలిపించుకుని తీరుతామని ఉద్ఘాటించారు. గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లి అడ్డుకున్నా సరే బీసీల ప్రాతినిధ్యం పెంచేందుకుమిగతాది 2లో...

# అధికార పార్టీల హవా



**బెంగాల్ ఉప ఎన్నికల్లో 2 సీట్లలో బీజేపీ జయభేరి**

**తమిళనాడులో 2 సీట్లు ఖాతాలో వేసుకున్న టీవీకే**

**అసోంలోని నగావ్ లోక్‌సభ స్థానం బీజేపీదే**

**పుదుచ్చేరి అసెంబ్లీలో ఏకైక స్థానాన్ని ఏఐఎన్ఆర్‌సీ కైవసం**

**బీజేపీ గెలుపుపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం**

**న్యూఢిల్లీ/ చెన్నై,అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
: మూడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఐదు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి ఈ నెల 6న జరిగిన ఉప ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీలే జయభేరి మోగించాయి. బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్.. తమిళనాడులోని మధురాంతకం, ధారాపురం.. పుదుచ్చేరిలోని తట్టంచావడి అసెంబ్లీ స్థానాలతోపాటు అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానానికి మిగతాది 2లో...

# ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

## రాష్ట్రపతి ముర్ముకు ఇండియా కూటమి నేతల వినతి



**ఓట్ల చోరీ జరిగిందనటానికి పూర్తి ఆధారాలున్నాయి**

**గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికల్ని రద్దు చేయాలి!**

**ఇకపై ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలి**

**ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి, జ్ఞానేశ్‌ను తొలగించాలి**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో వరుసగా మూడు రోజులు ఢిల్లీలో ఉద్యమించిన ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని, దానిని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని, ఈవీఎంలను పక్కనపెట్టి ఇకపై బ్యాలెట్ మిగతాది 2లో...



# ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

**ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి**

**రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ**

**హైదరాబాద్ అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని మిగతాది 2లో...

# భద్రతా వలయంలో ఢిల్లీ!

(మొదటి పేజి తరువాయి

తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు.

భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్+ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు.

ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పూర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

# అధికార పార్టీల హవా

(మొదటి పేజి తరువాయి

నిర్వహించిన ఉప ఎన్నికల ఫలితాలను శుక్రవారం వెల్లడించారు. నందిగ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి హసిరాణి రథ్ తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను రికార్డు స్థాయిలో 1,22,753 ఓట్ల తేడాతో ఓడించారు. హసిరాణికి 1,64,427 ఓట్లు పోలవగా, మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు మాత్రమే వచ్చాయి. ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న రెజీనగర్‌లో కూడా బీజేపీ జయకేతనం ఎగురవేసింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి శంకర సర్కార్ తన సమీప ప్రత్యర్థి, ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ(ఏజేయూపీ) అభ్యర్థి గొలామ్‌నబీ ఆజాద్‌పై 75,816 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇక్కడ దాదాపు 60 శాతం ముస్లిం ఓటర్లే ఉంటారు. అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానంలో అధికార బీజేపీ అభ్యర్థి దేబాశిష్ శర్మ తన సమీప ప్రత్యర్థి, ఏఐయూడీఎఫ్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్‌ను 1,42,224 ఓట్ల తేడాతో ఓడించారు. గెలుపొందిన బీజేపీ అభ్యర్థులనుప్రధానిమోదీ అభినందించారు. ముస్లిం ఓటర్లు బీజేపీని ఆదరిస్తున్నారనటానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు.తమిళనాడులోని మధురాంతకం (ఎస్సీ) అసెంబ్లీ స్థానంలో అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే) అభ్యర్థి మరగతం కుమారవేల్ తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌ను 20,040 ఓట్ల తేడాతో ఓడించారు. ధారాపురం (ఎస్సీ)లో టీవీకే అభ్యర్థి సత్యభామ.. డీఎంకే అభ్యర్థి సుగన్యను 9,471 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ గెలుపుతో తమిళనాడు అసెంబ్లీలో టీవీకే బలం 109 సీట్లకు పెరిగింది. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీ మార్కు 118 కాగా, ఏప్రిల్- మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 సీట్లు గెలిచింది. రెండుసీట్లలో గెలిచిన సీఎం విజయ్ తిరుచిరాపల్లి ఈస్ట్ స్థానాన్ని వదులుకోవటంతో ఆ పార్టీ బలం 107కు తగ్గింది. తాజాగా 109కి పెరిగింది. పుదుచ్చేరిలోని తట్టన్‌చావడి స్థానంలో అధికార ఏఐఎన్ఆర్‌సీ పార్టీ అభ్యర్థి అశోక్ ఆనంద్ కాంగ్రెస్ అభ్యర్థి ఈ వినాయగమ్‌ను 8,400 ఓట్ల తేడాతో ఓడించారు.

## పెండింగ్ దరఖాస్తులకు నెలలోగా పరిష్కారం

తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు.ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని పొంగులేటి వెల్లడించారు.

సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఏ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని... 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొంది 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

# పూల పండుగకు వేళాయే...

**పూల పండుగకు పుట్టింటికి ఆడపడుచులు దేవీ నవరాత్రులతో భక్తి పారవశ్యం**

**18న సద్దుల బతుకమ్మ.. 20న విజయదశమి**

**హైదరాబాద్ అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
పల్లెలు పండుగ శోభను సంత రించుకోనున్నాయి. ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ.. భక్తిశ్రద్ధలతో కొలిచే దేవీ శరన్నవరాత్రులు.. విజయదశమి వేడుకలు.. ఇలా పండుగల సందడి మొదలుకానుంది. పట్టణాలు, గ్రామాల్లో ఇప్పటికే పండుగ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. దేవాలయాలు, ప్రధాన కూడళ్లు, బతుకమ్మ ఆడే ప్రదేశాలు ముస్తాబవుతున్నాయి. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఆడపడుచులు పుట్టింటికి తరలివస్తారు

కుటుంబ సభ్యులు, తోబుట్టువులు, బంధువులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచుల రాకతో గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొంటుంది.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను పేర్చి, సాయంత్రం మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు చేసుకుంటారు. ప్రకృతి, నీరు, మట్టి, పూలతో ప్రజలకు ఉన్న అనుబంధాన్ని ఈ పండుగ ప్రతిబింబిస్తుంది. బతుకమ్మను తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.బతుకమ్మ ఉత్సవాలు శనివారం ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్నాయి. చిన్న బతుకమ్మల నుంచి పెద్ద బతుకమ్మల వరకు రోజుకో ప్రత్యేకతతో వేడుకలు నిర్వహిస్తారు. చివరి రోజైన 18న సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకోనున్నారు.

బతుకమ్మతో పాటు ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు, భజనలు, పారాయణాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని పలు ప్రధాన దేవాలయాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లోనూ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.నవరాత్రుల అనంతరం ఈనెల 20 మంగళవారం విజయదశమి జరగనుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరాను నిర్వహించడం ఆనవాయితీ. తెలంగాణలో దసరాకు ప్రత్యేక స్థానం ఉంది. కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లడం, జమ్మి చెట్టును పూజించడం, పెద్దలను కలిసి ఆశీర్వాదాలు తీసుకోవడం, పరస్పరం జమ్మి ఆకులను ఇచ్చిపుచ్చుకోవడం వంటి సంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.బతుకమ్మ, దసరా పండుగలు కేవలం ఆచార వ్యవహారాలు మాత్రమే కాదు.. కుటుంబాలను, బంధుత్వాలను కలిపే వేడుకలు. ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లినవారు పండుగ సందర్భంగా స్వగ్రామాలకు చేరుకుంటారు. ముఖ్యంగా బతుకమ్మ సందర్భంగా ఆడపడుచులు పుట్టింటికి రావడంతో గ్రామాల్లో పాత జ్ఞాపకాలు, ఆత్మీయ పలకరింపులు, బంధుత్వాల సందడి కనిపిస్తుంది. గ్రామాలు, పట్టణాల్లో పండుగ ఏర్పాట్లు మొదలయ్యాయి. బతుకమ్మ ఆడే ప్రదేశాలను శుభ్రం చేయడం, ఆలయాలను విద్యుద్దీపా లతో అలంకరించడం, ఉత్సవ కమిటీల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. మార్కెట్లలో పూలకు డిమాండ్ పెరగడంతో పూల వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

(మొదటి పేజి తరువాయి

ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

# నవీ పిల్లేకు నోబెల్ శాంతి పురస్కారం..

**భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిల్లే**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్లేను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది.దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్లే జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో



ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ , అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. రువాండా ట్రిబ్యునల్‌లో నవీ పిళ్లే పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అధికార రాజకీయాల ప్రాబల్యం పెరిగి, న్యాయ వ్యవస్థలు బలహీనపడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో, శాంతికి న్యాయమే పునాది అని, అరాచకం, అధికార దర్పం మధ్య న్యాయాన్ని కాపాడే న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకమని నొక్కి చెప్పింది. నవీ పిళ్లే వంటి ధైర్యవంతులు దేశాలను, నాయకులను జవాబుదారీగా నిలబెడుతూ, హింస బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని ప్రశంసించింది. ఆమె నిబద్ధత, స్వాతంత్ర్యం, అపారమైన అనుభవం ఆమెను మన కాలంలోని అత్యంత గౌరవనీయమైన అంతర్జాతీయ న్యాయవేత్తలలో ఒకరిగా నిలబెట్టాయని కమిటీ పేర్కొంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా దేశాల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడింది.

# కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా బీసీలకు 34% ఇస్తాం

(మొదటి పేజి తరువాయి

టీడీపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామంలో మీభూమి-మీహక్కు కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తాజా తీర్పుపై సభలో చంద్రబాబు స్పందించారు. సామాజికంగా, ఆర్థికంగా బీసీలను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీనే అన్నారు. ఎన్టీఆర్ పాలనలో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు ఇస్తే, తాను వచ్చాక 34 శాతం చేశానని, గత వైసీపీ ప్రభుత్వం దానిని 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. వైసీపీ నిర్వాకంతో 16,800 పదవులు బీసీలు కోల్పోయారన్నారు. తిరిగి కూటమి వచ్చాక 34 శాతం రిజర్వేషన్లను నిర్ణయిస్తే, దానిని వ్యతిరేకిస్తూ గొడ్డలి పార్టీ వాళ్లు కోర్టుకు వెళ్లారని అన్నారు. తొలి నుంచి గొడ్డలి పార్టీకి బీసీలంటే వ్యతిరేకత, చిన్నచూపే ఉందని విమర్శించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు 34 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చాయని, అయితే అంతకన్నా అధికంగానే పార్టీ పరంగా బీసీలకు సీట్లుఇచ్చి గెలిపిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలంటే గొడ్డలి పార్టీకి వెన్నులో వణుకు పుడుతోందని, ఎన్నికల్లో ఓటమి చెందాక గ్రామాల్లో వారి కార్యకర్తలు బయటకురారని భయపడుతూ ఎలాగోలా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 'సర్'ను ఒకవైపు వ్యతిరేకిస్తూ మరోవైపు అది పూర్తయ్యాక ఎన్నికలు పెట్టాలని కోర్టుకు వెళ్లి రెండు నాల్కల ధోరణి ప్రదర్శించారని చంద్రబాబు విమర్శించారు.

నీటి సౌకర్యంతో అభివృద్ధి సాధ్యమన్న చంద్రబాబు.. పట్టిసీమతో కృష్ణా డెల్టాకు గోదావరి నీరు తీసుకురావడం వల్ల శ్రీశైలం నుంచి వెలిగొండకు నీరివ్వగలిగామని వివరించారు. గోదావరి-కావేరి అనుసంధానర చేస్తే ఐదు రాష్ట్రాలు, ఐదు జీవనదులు అనుసంధానమై అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రధాని మోదీతోనూ ఈ విషయంపై చర్చించానని చెప్పారు. వెలిగొండ రెండోదశను కూడా రెండేళ్లలో పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, సంపద వృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న మంచి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. 'మంచి పని చేసేవారిని గుర్తిస్తే మంచి జరుగుతుంది. ఓసారి గత వైసీపీ పాలనను గుర్తుచేసుకోండి. అప్పట్లో ఎవరి మొహంలో నవ్వు అన్నది లేదు. ఇంట్లో, బయట కూడా భద్రత లేదు. ఎటుచూసిన విధ్వంసమే సాగింది. అలాంటి పరిస్థితి మళ్లీ రాష్ట్రానికి రాకూడదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి అపూర్వ విజయం అందించినట్లు స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు ఆశీర్వదించండి' అని కోరారు.

# ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

(మొదటి పేజి తరువాయి

పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంటూ ఒక విజ్ఞాపనపత్రం అందజేశారు. ఇండియా కూటమి ఎంపీలు దేశంలోని 60 శాతం జనాభాకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రపతిని కలవటానికి ముందు ఇండియా కూటమి ఎంపీలు 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ పార్లమెంటు హౌస్ నుంచి విజయ్‌చౌక్ వరకూ ర్యాలీ జరిపారు. విజయ్‌చౌక్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం, రాష్ట్రపతి భవన్ నుంచి పిలుపు రావటంతో ఇండియా కూటమి నేతల బృందం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లింది. ఈ బృందంలో రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే(కాంగ్రెస్), మమతా బెనర్జీ (తృణమూల్), ఒమర్ అబ్దుల్లా (ఎన్‌సీ), సుప్రియాసూలే (ఎన్సీపీ-పవార్), రాజీవ్‌రాయ్ (ఎస్పీ), మనోజ్‌ఝా (ఆర్జేడీ), తిరుమావలన్ (వీసీకే), డీ రాజా (సీపీఐ), ఎంఏ బేబి (సీపీఎం) ఉన్నారు. రాష్ట్రపతిని కలిసి విజ్ఞాపనపత్రం అందజేసిన అనంతరం తిరిగి వచ్చి మీడియాతో నేతలు మాట్లాడారు.

మోదీ, అమిత్‌షా, జ్ఞానేశ్‌కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే కుట్ర పన్నారని రాష్ట్రపతికి తెలియజేశామని రాహుల్ పేర్కొన్నారు. 'మేం చెప్పినదాన్ని రాష్ట్రపతి ఎంతమాత్రం నిరాకరించలేదు. ప్రశ్నించలేదు కూడా. మా ఆరోపణలకు ఆధారాలు ఉంటే ఇవ్వమని అడిగారు' అని రాహుల్ తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను సోమవారం కలిసి విజ్ఞాపనపత్రం అందజేస్తామని వెల్లడించారు. ఖర్గే మాట్లాడుతూ, రాష్ట్రపతి అడిగిన ఆధారాల్ని తాము సమర్పిస్తామన్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్ని ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలన్నారు.

**13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలి**

ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతికి సమర్పించిన విజ్ఞాపనపత్రంలో పలు కీలక డిమాండ్లు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తప్పించాలి, సీఈసీకి, ఎన్నికల మిషనర్లకు న్యాయవిచారణ నుంచి రక్షణ కల్పిస్తున్న 2023 నాటి చట్టాన్ని రద్దు చేయాలి, ఇకపై దేశంలో జరిగే అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలి, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలి, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి ఆ జాబితాలో చేర్చాలి, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీల ఎన్నికల్ని రద్దు చేయాలి.. వీటిలో ఓట్ల చోరీ జరిగినట్లుగా స్పష్టమైన ఆధారాలున్నాయని పేర్కొన్నారు. కోట్లాది మంది భారతీయులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును హరించటానికి యావత్ ఎన్నికల వ్యవస్థను, ప్రజాస్వామ్య వ్యవస్థలను మోదీ, అమిత్‌షా చెరబట్టారని ఆరోపించారు. 'హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీసగఢ్, బిహార్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికను బీజేపీ దొంగిలించిందని, భారీ ఎత్తున ఓట్లచోరీ జరిగిందనటానికి తమ వద్ద తిరుగులేని ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ ఈవీఎంలను, ఓటర్ల జాబితాలను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఈ సంక్షోభ సమయంలో భారత రిపబ్లిక్ రాజ్యాంగ అధినేతగా తగిన చర్యలు తీసుకోవాలని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు..

**ఉద్యమిస్తే ప్రభుత్వ పతనం ఖాయం: రాహుల్**

రాష్ట్రపతిని కలవటానికి ముందు ఇండియా కూటమి ఎంపీలు సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. దేశంలో జ్ఞానేశ్‌కుమార్‌ను మించిన సమస్య ఉందని, దానిని పరిష్కరించాలంటే ప్రస్తుత ప్రభుత్వాన్నే తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. గత 3-4 రోజులుగా ఉద్యమిస్తున్న విధంగానే విపక్షాలు ముందుకు దూసుకెళ్తే మోదీ ప్రభుత్వం కుప్పకూలటం ఖాయమని చెప్పారు. విపక్షాల ఉద్యమంతో ప్రభుత్వ వణుకుతోందన్నారు. ఇదిలా ఉండగా, దేశంలో ప్రతి వ్యాపారానికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు. క్రోనీ క్యాపిటలిజం(ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం) గొలుసును తెంచుతామని, వ్యాపారులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు







# శివునిపెల్లి విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా అమరేందర్



**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపెల్లిలో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడిగా కేషోజు అమరేందర్‌ను గ్రామ పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం స్టేషన్ ఘన్‌పూర్ మండల సంఘం అధ్యక్షుడు కాసోజు రవీందర్, గౌరవాధ్యక్షుడు మారేడుపాక ఉమాశంకర్ నూతన అధ్యక్షుడు అమరేందర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

# డాన్ బాస్కో పాఠశాలలో వైభవంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు



**తల్లాడ/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలం పినపాక గ్రామంలోని డాన్ బాస్కో పాఠశాల ఆవరణలో దసరా పండుగను పురస్కరించుకుని శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ సంప్రదాయ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఆటపాటలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.

## లిటిల్ సిటిజన్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సంబరాలు**



**కేసముద్రం/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
అమీనాపురంలోని లిటిల్ సిటిజన్ స్కూల్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పండుగ సంబరాలను అంబరాన్నంటేలా జరుపుకున్నారు.










# 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి.. సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్

**హైదరాబాద్ అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు.



భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ా×= ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు.
మరోవైపు, రేపు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.






# ఎమ్మెల్యే చొరవతో సుప్రియాశ్రీకాంత్‌ల వివాహం

### ప్రేమ వ్యవహారంలో బాధపడుతున్న యువతికి అండగా నిలిచిన కేఆర్ నాగరాజు




**హసన్‌పర్తి/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** ప్రేమ వ్యవహారంలో ఎదురైన సమస్యతో తీవ్ర మనోవేదనకు గురైన సుప్రియా అనే యువతికి అండగా నిలిచి, ఆమెకు న్యాయం జరిగేలా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవ తీసుకున్నారు. వర్ధన్నపేట లీగల్ సెల్ ఇన్‌చార్జి, న్యాయవాది నిమ్మని శేఖర్‌రావుతో కలిసి ఈ వ్యవహారంపై స్పందించారు.




# త్రివేణి పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**సత్తుపల్లి/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లిలోని త్రివేణి పాఠశాల శాఖలో ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సరిత మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగకు విశిష్ట స్థానం ఉందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, విద్యా విభాగం ఇన్‌చార్జ్ పవన్, కిడ్స్ విభాగం ఇన్‌చార్జ్ శ్రీ పద్మ విద్యార్థులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



త్రివేణి పాఠశాలల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి, సీఆర్వో మురళీకృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సాంస్కృతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాలలో పండుగలు, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

# కిట్స్‌లో స్మార్ట్ సిస్టమ్ డిజైన్‌పై రెండు రోజుల శిక్షణ

### ఆర్డునో, సెన్సార్లు, ఐఓటీ అనువర్తనాలపై విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ




**హసన్‌పర్తి/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో స్మార్ట్ సిస్టమ్ డిజైన్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. వరంగల్‌కు చెందిన జీజీ మ్యాడ్ సెహోవి ఏఐఓటీ సొల్యూషన్స్ సహకారంతో అక్టోబర్ 9, 10 తేదీల్లో కళాశాల ప్రాంగణంలోని సివిల్ సెమినార్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.









# విశ్వశాంతి విద్యానికేతన్‌లో స్వచ్ఛ భారత్ చిత్రలేఖనం పోటీలు

## విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం





**సత్తుపల్లి/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా సత్తుపల్లి పట్టణంలోని శ్రీ విశ్వశాంతి విద్యానికేతన్ పాఠశాలలో 6, 7 తరగతుల విద్యార్థులకు స్వచ్ఛ భారత్ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

పాఠశాల ప్రిన్సిపాల్ పి. నాగేశ్వరరావు, కె. శైలజ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి పట్టణ భాజపా అధ్యక్షుడు బానోత్ విజయకుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర భాజపా అధికార ప్రతినిధి, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి నంబూరి రామలింగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**విజేతలకు బహుమతుల ప్రదానం**

చిత్రలేఖనం పోటీల్లో డి. వికిల్ సాక్షిత్ ప్రథమ, కె. ప్రదీప్ ద్వితీయ, కె. రీనా హర్షిని తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ముఖ్య అతిథి షీల్డులు అందజేసి అభినందించారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతోపాటు సామాజిక బాధ్యతను అలవర్చడం, సృజనాత్మకతను ప్రోత్సహించడం ఈ కార్యక్రమాల ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ప్రజాసేవకు ప్రాధాన్యం

ఈ సందర్భంగా నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవిత ప్రస్థానంలో ప్రజాసేవ, సుపరిపాలన, దేశాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చారని పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన ఆయన పాలనా ప్రస్థానం నుంచి ప్రధానమంత్రిగా దేశానికి నాయకత్వం వహించే వరకు ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పేదల సంక్షేమం, స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ నాగ మౌనిక, డాక్టర్ పెద్దిరాజు, వీరబాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సంక్షేమ పథకాల అమలులో అర్హులందరికీ న్యాయం జరగాలి

## రిజర్వేషన్లు, పదోన్నతుల అమలుపై సమీక్ష.. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు సద్వినియోగం కావాలి



**హసన్‌పర్తి/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
ఎస్సీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పదోన్నతుల అమలు, ఎస్సీ ఉప ప్రణాళిక నిధుల వినియోగంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ద

# శ్రీ చైతన్య పాఠశాలలో బతుకమ్మ సంబరాలు.

## -అలరించిన చిన్నారుల ఆటపాటలు..!



**బయ్యారం/,అక్టోబర్ 9.(జర్నలిస్ట్ వార్త)**స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో అలరించారు.చదువుతో పాటు సంస్కృతి,సాంప్రదాయాలను నేర్పించడమే తమ లక్ష్యమని ప్రిన్సిపాల్ షేక్ మదార్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు,సిబ్బందికి శ్రీ చైతన్య విద్యాసంస్థల తెలంగాణ చైర్మన్ శ్రీధర్,డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్ మాధుర్ ముందస్తు బతుకమ్మ,దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ షేక్ మదార్,డీన్ విద్యాసాగర్, సి-బ్యాచ్ ఇన్చార్జ్ మల్లేశం,ప్రైమరీ ఇన్చార్జ్ ప్రవల్లిక,ప్రీ-ప్రైమరీ ఇన్చార్జ్ షహనాజ్,ఏఓ సుధాకర్,పీఈటీలు యాకయ్య,రాకేష్, ప్రియాంక,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# బతుకమ్మ శుభాకాంక్షలు



**ఐనవోలు/అక్టోబర్ 9(జర్నలిస్ట్ వార్త);**
బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ అన్నారు. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మండల ప్రజలకు, ముఖ్యంగా ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తుందని, తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించాలని కోరారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# వాహనదారులు, ప్రజల ఇబ్బందులు తొలగించడమే ధ్యేయం.

## -రూ.4 కోట్ల డ్రైనేజీ పనులకై మంత్రిని కోరిన ఎమ్మెల్యే కోరం,సర్పంచ్ ప్రవీణ్.



**బయ్యారం/,అక్టోబర్ 9.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెం గ్రామం నుండి గంధంపల్లి వరకు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి ఇరువైపులా సైడ్ డ్రైనేజీ మంజూరు చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన వినతిపత్రాన్ని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యతో కలిసి కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా దుబ్బగూడెం నుండి గంధంపల్లి వరకు రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల వర్షాకాలంలో నీరు రోడ్డుపైకి చేరి దెబ్బతింటోందని, వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదాల నివారణకు తక్షణమే రూ. 4 కోట్లతో సైడ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ తెలిపారు.

# బయ్యారంలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలు..

## -పారదర్శక సేవలకు అధికారుల ప్రతిజ్ఞ.!



**బయ్యారం/,అక్టోబర్ 9.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం2005 వారోత్సవాల్లో భాగంగా అధికారులు,సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు,మండల విద్యాశాఖ అధికారి లక్ష్మన్ రావు,మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ పర్యవేక్షకుడు,ఉప తహసీల్దార్ సునీల్, ప్రధాన పోలీసు కానిస్టేబుల్ ఖాజా మొయిద్దీన్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు,సిబ్బంది పౌరులు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.అలాగే చట్ట ప్రకారం స్వచ్ఛందంగా ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన సమాచారాన్ని పౌరులకు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

# బయ్యారంలో బగ్గుమన్న కాంగ్రెస్ అసమ్మతి.

## -ఎమ్మెల్యే వ్యవహారశైలిపై నాయకుల పోరుబాట.

**బయ్యారం/,అక్టోబర్ 9,(జర్నలిస్ట్ వార్త)**
ఇల్లందు నియోజకవర్గం బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీలో అంతర్గత అసంతృప్తి ఒక్కసారిగా తెరపైకి వచ్చింది.పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడిన సీనియర్ నాయకులకు తగిన గుర్తింపు లభించడం లేదంటూ బయ్యారం మండల కాంగ్రెస్ నాయకులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే కోరం కనకయ్య వ్యవహారశైలి,ఏకపక్ష నిర్ణయాలు, పార్టీలో కొందరికే ప్రాధాన్యత కల్పిస్తున్నారనే ఆరోపణలతో బయ్యారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

బయ్యారం మండల కేంద్రంలోని కోదండరామాలయ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుగులోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.వివిధ గ్రామాలకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని పార్టీలో నెలకొన్న పరిస్థితులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

**ఒక వర్గానికే పెద్దపీట వేస్తున్నారంటూ ఆరోపణలు..**

పార్టీ కష్టకాలంలో జెండా మోసి, కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన నాయకులను పక్కన పెడుతున్నారని సమావేశంలో పలువురు నాయకులు ఆరోపించారు.ముఖ్యంగా మూల మధుకర్ రెడ్డి వర్గానికి ఎమ్మెల్యే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని,దీనివల్ల పార్టీలో అసమానతలు పెరుగుతున్నాయని విమర్శించారు. వ్యక్తిగత ప్రాధాన్యతలకు బదులుగా పార్టీ కోసం పనిచేసిన వారందరికీ సముచిత గౌరవం కల్పించాలని డిమాండ్





చేశారు.

**అభివృద్ధి ఎక్కడ..సర్పంచ్‌లకు సహకారం ఏది..?**

మండలంలో అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన సర్పంచ్‌లకు అవసరమైన సహకారం అందడం లేదని ఆవేదన వెలిబుచ్చారు.ప్రజల్లో పార్టీపై నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు న్యాయం చేయాలి.**

ఎన్నో ఏళ్లుగా వ్యక్తిగత జీవితాలను సైతం పక్కనపెట్టి పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కడం లేదని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.పదవుల కోసం కాకుండా పార్టీ సిద్ధాంతాలపై నమ్మకంతో పనిచేశామని,అలాంటి తమ సేవలను గుర్తించి సముచిత స్థానం కల్పించాలని కోరారు.పార్టీ కోసం కష్టపడిన వారిని విస్మరిస్తే భవిష్యత్తులో పార్టీ బలోపేతంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

**అధిష్టానం జోక్యం చేసుకోవాలి.**

ఇల్లందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలంటే ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర,జిల్లా కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు విజ్ఞప్తి చేశారు.పార్టీలో నెలకొన్న విభేదాలను పరిష్కరించి, వర్గ రాజకీయాలకు స్వస్తి పలికి, సీనియర్ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను సమన్వయంతో ముందుకు నడిపించాలని కోరారు.

ఈ సమావేశంలో బయ్యారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# చెన్నారంలో భూ రీ-సర్వే పరిశీలించిన కలెక్టర్ సత్య శారద.



**వర్ధన్నపేట/అక్టోబరు 9 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పురోగతి, సమస్యలు, పెండింగ్ పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, ఆర్డీవో సుమ, తహసీల్దార్ విజయ్ సాగర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అకాల మరణం చెందిన కిసాన్ సంఘం సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**కేసముద్రం/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండల కేంద్రానికి చెందిన జై కిసాన్ సంఘం సభ్యుడు బండి కొమురయ్య అకాల మరణం చెందడంతో సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం జై కిసాన్ సంఘం అధ్యక్షుడు సంకేపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గండి శ్రీనివాస్, నాయకులు కొమ్మల జయేంద్ర రెడ్డి, మూల భూలోక రెడ్డి, వేముల కొమ్మారెడ్డి బాధిత కుటుంబాన్ని కలిసి కొమురయ్య మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు





**కల్లూరు/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కల్లూరులోని తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ఇళ్లలో సంప్రదాయబద్ధంగా తయారు చేసిన రంగురంగుల బతుకమ్మలను పాఠశాలకు తీసుకొచ్చారు. వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండుగ సందడి నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పేలా వేడుకలు సాగాయి.

# యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ అవార్డుకు హిందీ ఉపాధ్యాయురాలు రమాదేవి ఎంపిక

**విద్యా సేవలు, కిచెన్ గార్డెన్ అభివృద్ధికి గుర్తింపు.. అభినందించిన హెచ్‌ఎం జయ, ఉపాధ్యాయులు**




**నర్సంపేట/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు బి. రమాదేవి తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఫర్ యునైటెడ్ నేషన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న వరంగల్‌లో ఏకశిల క్లబ్ ఫర్ యునెస్కో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు జ్యూరీ కమిటీ అవార్డులను ప్రకటించింది.

# జర్నలిస్టులకు రైల్వే పాసులు పునరుద్ధరించాలి

**కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు టీఎంజేఎఫ్ వినతి**



**కరీంనగర్/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** జర్నలిస్టులకు రైల్వే పాసులు పునరుద్ధరించాలని, రక్షణ చట్టాన్ని పటిష్ఠం చేయడంతోపాటు టోల్ ఫీజు మినహాయింపు కల్పించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం (టీఎంజేఎఫ్) రాష్ట్ర నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు టీఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ తెలిపారు.
విధి నిర్వహణలో జర్నలిస్టులకు భద్రత కల్పించేందుకు రక్షణ చట్టాన్ని పటిష్ఠం చేయాలని, వార్తా సేకరణ కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లే పాత్రికేయులకు టోల్ ప్లాజాల వద్ద రుసుము మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులకు సంక్షేమ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్, కోశాధికారి బోట్ల సదానందం, గౌరవ సలహాదారు పసుల తిరుపతి, ఉపాధ్యక్షుడు వక్కల వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి అనిల్, నాయకులు సర్వాణి శ్రీనివాస్, గాజుల స్వామి, మాతంగి శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి లంక స్వామి, సిరిసిల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి

**ప్రతి పట్టభద్రుడి ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి**



**కేసముద్రం/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
రాబోయే ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన విస్తృతస్థాయి సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు.

# సంప్రదాయాల సోయగం.. సంబరాల బతుకమ్మ!

**శ్రీ వివేకవర్ధిని పాఠశాలల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు**



**కేసముద్రం/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని ఉన్నత పాఠశాలతో పాటు మహమ్మూద్‌పట్నం శివారులోని శ్రీ వివేకవర్ధిని నివాస పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను తీసుకొచ్చి ఆటపాటలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు.

# కేసముద్రం జడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడిన మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ రామ నాగేశ్వర్‌రావు**



**కేసముద్రం/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కేసముద్రం స్టేషన్ జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అల్లం రామ నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# పట్టభద్రుల ఓట్లు నమోదుపై కాంగ్రెస్ నేతల అవగాహన

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమరెడ్డికి మద్దతివ్వాలి: లక్ష్మారెడ్డి**




**తల్లాడ/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ తల్లాడ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పలువురు పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ**

**ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్**




**నర్సంపేట/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో జాతీయ సేవా పథకం, మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

# భూగర్భ జలాల పెంపునకు బోర్వెల్ రీఛార్జ్ పనులు

**సర్పంచ్ యమున సుమన్ నాయక్**



**కేసముద్రం/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
భూగర్భ జలమట్టాన్ని పెంచి, భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడడమే లక్ష్యంగా నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలోని చెరువుకొమ్ము తండాలో బోర్వెల్ రీఛార్జ్ పనులను సర్పంచ్ ధరావత్ యమున సుమన్ నాయక్ ప్రారంభించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను సంరక్షించేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వనమాల వెంకటరమణ





**ఖమ్మం/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంతోపాటు, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి వనమాల వెంకటరమణ సూచించారు. ఖమ్మంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల కార్యశాలలో ఆయన పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పోలింగ్ బూత్ స్థాయిలో పటిష్ఠ కార్యాచరణ రూపొందించుకోవాలని వెంకటరమణ పేర్కొన్నారు. పట్టభద్రులతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలోనూ ఆయన పాల్గొని ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత, ఓటరు నమోదు, క్షేత్రస్థాయి కార్యాచరణపై మాట్లాడారు. ఈ కార్యశాలలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు నెల్లి కోటేశ్వరరావు, పుల్లారావు యాదవ్, ఉదయ్ ప్రదీప్, వెంకట్ బోయ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు నెలలకే రోడ్డు తవ్వకాలు!

**రూ.3 కోట్ల సీసీ రోడ్డుకు పైపులైను లీకేజీ గండం -నిర్మాణానికి ముందే పైపులైను పరిస్థితిని పరిశీలించలేదా?**

**ప్రజాధనం నష్టంపై సమగ్ర విచారణ జరపాలి.. పెద్ద పెండ్యాల గ్రామస్థుల డిమాండ్**



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** రూ.3 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన సీసీ రహదారికి పది నెలలు కూడా నిండకముందే తవ్వకాల అవసరం ఏర్పడటంపై పెద్ద పెండ్యాల గ్రామంలో ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాలలో నీటి పైపులైను లీకేజీ మరమ్మతుల కోసం కొత్తగా నిర్మించిన రహదారిని తవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలతో రహదారి నిర్మించిన సమయంలో భూగర్భ పైపులైన్ల పరిస్థితిని పరిశీలించారా? సంబంధిత శాఖల మధ్య సమన్వయం చేసుకున్నారా? భవిష్యత్తులో మరమ్మతులు అవసరమయ్యే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. నిర్మాణం పూర్తయిన కొద్దికాలానికే రహదారిని తవ్వాల్సి రావడం పనుల ప్రణాళిక, నిర్వహణపై సమీక్ష అవసరాన్ని స్పష్టం చేస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

**నిర్మాణానికి ముందు ఏం పరిశీలించారు?**

గ్రామంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారిని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అయితే పది నెలలు కూడా గడవకముందే పైపులైను లీకేజీ కారణంగా రహదారిని తవ్వాల్సి రావడం చర్చనీయాంశమైంది. సాధారణంగా రహదారి నిర్మాణానికి ముందు సంబంధిత ప్రాంతంలోని భూగర్భ నీటి పైపులైన్లు, ఇతర మౌలిక వసతుల వివరాలను పరిశీలించడం, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవడం కీలకం. పెద్ద పెండ్యాలలో ఈ ప్రక్రియ ఏ మేరకు అమలైందన్నది అధికారులు వెల్లడించాల్సి ఉంది. నిర్మాణానికి ముందు పైపులైను వివరాలను పరిశీలించినట్లు రికార్డులు ఉన్నాయా? ఉంటే, మరమ్మతుల కోసం మళ్లీ రహదారిని తవ్వాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

**లీకేజీ మరమ్మతులా.. ప్రజాధనంపై భారమా?**

పైపులైను లీకేజీని సరిచేయడం ప్రజలకు అవసరమైన సేవే. అయితే ఆ మరమ్మతుల కోసం కొత్తగా నిర్మించిన రహదారిని తవ్వాల్సి రావడం వల్ల ప్రజాధనంతో కల్పించిన మౌలిక వసతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. పైపులైను మరమ్మతులకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయా? రహదారికి నష్టం తగ్గించే సాంకేతిక పద్ధతులను పరిశీలించారా? తవ్వకాలు అనివార్యమైతే, పనులు పూర్తయ్యాక రహదారిని నిబంధనల ప్రకారం పునరుద్ధరించే బాధ్యత ఎవరిది? అనే అంశాలపై స్పష్టత అవసరం. కేవలం లీకేజీని సరిచేసి పనులు ముగించడం కాకుండా, రహదారికి జరిగిన నష్టాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**బాధ్యులెవరు? నష్టాన్ని ఎవరు భరిస్తారు?**

రహదారి నిర్మాణానికి వెచ్చించిన నిధులు ప్రజల సొమ్ము. అందువల్ల పనుల ప్రణాళిక నుంచి అమలు వరకు ప్రతి దశలో జవాబుదారీతనం ఉండాలి. రహదారి నిర్మాణానికి సంబంధించిన అంచనాలు, సాంకేతిక అనుమతులు, పైపులైను వివరాల పరిశీలన, పనుల నాణ్యత, సంబంధిత శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలను అధికారులు పరిశీలించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో లేదా పైపులైను నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన, నిర్లక్ష్యం జరిగినట్లు విచారణలో తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రహదారి తవ్వకాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి, మరమ్మతుల వ్యయాన్ని నిబంధనల మేరకు బాధ్యుల నుంచి వసూలు చేసే అవకాశం ఉందా అన్నదానిపైనా అధికారులు పరిశీలన జరపాలి.

**ఉన్నతాధికారులు స్పందించేనా?**

పెద్ద పెండ్యాలలో చోటుచేసుకున్న ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ శాఖలు, గ్రామపంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు. రహదారి నిర్మాణానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, పైపులైను లీకేజీ కారణంగా తవ్వకాలు ఎందుకు అవసరమయ్యాయో వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. సాధ్యమైనచోట ప్రత్యామ్నాయ పద్ధతుల్లో మరమ్మతులు చేపట్టి, ఇప్పటికే దెబ్బతిన్న రహదారిని నిబంధనల ప్రకారం పునరుద్ధరించాలి. నిర్మాణం పూర్తయిన కొద్దికాలానికే తవ్వకాల అవసరం ఎందుకొచ్చిందో అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ప్రజాధనం వినియోగంపై పారదర్శకతతో పాటు బాధ్యతాయుతమైన నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.







# మత్తు మాఫియా ఉచ్చులో పడొద్దు!

**గంజాయి విక్రయిస్తే ఉపేక్షించేది లేదు..**

**1908కు సమాచారం ఇవ్వండి**

**తాటికాయలలో పోలీసుల అవగాహన కార్యక్రమం.. సైబర్ నేరాలపై కళాబృందం ప్రదర్శన**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని పోలీసులు యువతకు సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని ఎస్ఐ రవీందర్ చారి కోరారు. వరంగల్ నగర పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాటికాయల గ్రామంలో జాగృతి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**మత్తు పదార్థాలపై అప్రమత్తం కావాలి**

యువత మత్తు పదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సూచించారు. గ్రామాల్లో గంజాయి




విక్రయాలు, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కళాబృందం సభ్యులు పాటలు, నాటికలు, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు. విద్య ప్రాధాన్యం, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, డయల్ 112 అత్యవసర సేవలు, సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని వివరించారు.

**సైబర్ నేరాలపై కళాబృందం హెచ్చరిక**

సైబర్ నేరగాళ్ల మోసాలపై ప్రదర్శించిన నాటిక ప్రజలను ఆలోచింపజేసింది. సైబర్ నేరాల బారినపడితే ఆలస్యం




చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా ఆదరించాలని, మూఢనమ్మకాలను వీడాలని సందేశమిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మహిళా ఏఎస్ఐ, కళాబృందం ఇన్‌ఛార్జి నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియం, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ పూల్‌సింగ్, హోంగార్డులు శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, చిరంజీవి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 300 మంది గ్రామస్థులు హాజరయ్యారు.

# కరెంట్ కోతలు.. ఎండుతున్న పంటలు!

**కాంగ్రెస్ ప్రభుత్వంపై డాక్టర్ వన్నాల వెంకటరమణ విమర్శలు**







**కిల వరంగల్/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** 24 గంటల ఉచిత విద్యుత్ హామీ అమలు ఏమైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా బోర్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతు



సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నిరసిస్తూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఖమ్మం హైవేలోని తిమ్మాపురం సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఎండుతున్న పంటలపై తక్షణమే సర్వే నిర్వహించి బాధిత రైతులకు పూర్తి నష్టపరిహారం అందించాలని, నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం నరసయ్య, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ధర్నాను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పలువురు నాయకులను అరెస్టు చేశారు.

## గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం




**చేర్యాల/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని చేర్యాల ఎంపీడీవో అనభేరి ప్రణయ్ అన్నారు. మండలంలోని ముస్త్యాల గ్రామ రైతు వేదికలో వార్డు సభ్యులకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన వార్డు సభ్యులకు ఆయన ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే గ్రామస్థాయి నుంచే ప్రగతి ప్రారంభం కావాలన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పంచాయతీ కార్యదర్శులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి వర్ధన్నపేట విద్యార్థిని

**వర్ధన్నపేట/అక్టోబర్ 9(జర్నలిస్ట్ వార్త):** పట్టణానికి చెందిన వన్నాల రిష్మిత జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్‌మానక్ ప్రదర్శనకు ఎంపికైంది. న్యూఢిల్లీలో ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించనున్న 12వ జాతీయ స్థాయి ప్రదర్శన, ప్రాజెక్టుల పోటీల్లో పాల్గొననుంది. వన్నాల నాగరాజు, సౌభాగ్య దంపతుల కుమార్తె అయిన రిష్మిత 202324 విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటింది. అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని జిల్లా విద్యాశాఖ అధికారులు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




## ఖర్చుల లెక్కలడిగితే అవమానిస్తారా?




**వర్ధన్నపేట/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీలో మరోసారి వివాదం భగ్గుమంది. దసరా, వినాయక చవితి ఉత్సవాల ఖర్చులపై ప్రశ్నించినందుకు చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తమను దుర్భాషలాడుతూ అవమానించారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరోపించారు. చైర్మన్ ఏకపక్ష ధోరణిని నిరసిస్తూ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

జనరల్ బాడీ సమావేశం ఎజెండాపై ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఉత్సవాల సమావేశం పేరుతో సంతకాలు తీసుకునే ప్రయత్నం చేశారని కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో వినాయక చవితి వేడుకలకు ఎంత ఖర్చు చేశారు? నిధులు ఎలా వినియోగించారు? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాధనం ఖర్చులపై లెక్కలు అడగడం తమ బాధ్యతని, ప్రశ్నించినందుకు అవమానించడం ఏమిటని నిలదీశారు. ఉత్సవాల నిర్వహణ ఖర్చుల వివరాలు బహిర్గతం చేయాలని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని కోరారు. చైర్మన్ వ్యవహారశైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కౌన్సిల్ సమావేశాలు వివాదాలకు వేదికగా మారడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కౌన్సిలర్ల ఆరోపణలపై చైర్మన్ స్పందన తెలియాల్సి ఉంది.

## జాతీయ సైన్స్ బరిలో ఏకశిల విద్యార్థిని

**విజేతగా తిరిగి రావాలి.. జెస్సీకి చైర్మన్ తిరుపతిరెడ్డి అభినందనలు**




**ఐనవోలు/అక్టోబర్ 9 (జర్నలిస్ట్ వార్త):** జాతీయస్థాయి సైన్స్ పోటీలకు ఏకశిల విద్యాసంస్థ విద్యార్థిని కె. జెస్సీ ఎంపికైంది. న్యూఢిల్లీలో జరగనున్న 12వ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి, ప్రిన్సిపల్ ఎం.డి. బాబా, వైస్ ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థినిని శాలువాలతో సత్కరించి అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభ చాటి విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు సాంకేతిక, క్రీడా రంగాల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ఎం.డి. బాబా మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషితో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. జెస్సీ జాతీయస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇటీవల తమిళనాడులో జరిగిన జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న ఏకశిల విద్యాసంస్థకు చెందిన 24 మంది విద్యార్థులను కూడా ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ గుర్రం రమేష్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రజనీ 'జైలర్ 2' నుంచి 'వన్ నేమ్' వీడియో సాంగ్ విడుదల..




సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న భారీ చిత్రం 'జైలర్ 2' నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటికే లిరికల్ వీడియోతో చార్ట్‌బస్టర్‌గా నిలిచిన 'వన్ నేమ్' పాట పూర్తి వీడియోను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. సినిమా విడుదలకు సరిగ్గా వారం రోజుల ముందు ఈ మాస్ సాంగ్ వీడియోను రిలీజ్ చేయడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది.

ఈ వీడియోలో పాట చిత్రీకరణకు సంబంధించిన మేకింగ్ దృశ్యాలను కూడా జతచేయడం విశేషం. రజినీకాంత్ స్టైలిష్ లుక్స్, సెట్స్‌లో ఆయన హుషారు, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్టూడియోలో పనిచేస్తున్న విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. గత నెల సెప్టెంబర్ 29న విడుదలైన 'వన్ నేమ్' లిరికల్ సాంగ్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రజినీకాంత్ పాత్రను ఎలివేట్ చేస్తూ సాగే ఈ పాటకు అనిరుధ్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు వీడియో రూపంలోనూ ఈ పాట అంచనాలను మించి అలరిస్తోంది.

గతేడాది బ్లాక్‌బస్టర్ హిట్టయిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రజినీకాంత్‌తో పాటు బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, విద్యా బాలన్, ఎస్‌జే సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు, మిర్నా మీనన్ వంటి భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తోంది.'జైలర్ 2' చిత్రాన్ని అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా విడుదలకు ముందు ఈ వీడియో సాంగ్ ప్రమోషన్స్‌కు మరింత ఊపునిస్తుందని చిత్రవర్గాలు భావిస్తున్నాయి.

# శర్వానంద్ 'భోగి' నుంచి ఫస్ట్ సింగిల్..
## ఆకట్టుకుంటున్న 'ఎగిలివారంగ' గీతం

చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోగి'. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో భారీ అంచనాలను నెలకొల్పిన ఈ చిత్రం నుంచి చిత్ర బృందం మ్యూజికల్ ప్రమోషన్లను ప్రారంభించింది. ఇందులో భాగంగా 'ఎగిలివారంగ' అనే తొలి పాటను ఈ రోజు (అక్టోబరు 9) విడుదల చేసింది. ఈ జానపద గీతం సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ సాహిత్యం అందించారు. నల్గొండ గద్దర్ నరసన్న, కందుకూరి శంకర్ బాబు, రేలారే గోపాల్ తమ గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. ఈ పాటను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్న దర్శకుడు సంపత్ నంది, ఇది కేవలం పాట కాదని, ఒక మధురమైన జ్ఞాపకం అని అభివర్ణించారు. "బోసన్న భావాలు.. భీమ్స్ రాగాలు.. కలిసి.. ఇది పాట మాత్రమే కాదు ప్రతీ పల్లె ఆత్మను పలకరించే ఓ మధురమైన జ్ఞాపకం" అని ఆయన పేర్కొన్నారు. విడుదల చేసిన పోస్టర్‌లో పండుగ వాతావరణం ఉట్టిపడుతోంది. 1960ల నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా టీజర్ ఇప్పటికే 15 మిలియన్లకు పైగా వ్యూస్‌తో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచింది.

శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె. రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# డిసెంబర్ 4న నితిన్ 'అలియాస్ రుక్మిణి'..
## రుక్మిణి ఎవరో అక్టోబర్ 13న తెలుస్తుందట!

టాలీవుడ్ హీరో నితిన్ నటిస్తున్న కొత్త సినిమా 'అలియాస్ రుక్మిణి' విడుదల తేదీ ఖరారైంది. దర్శకుడు మురళీ కాంత్ దేవసోత్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ 'యునానిమస్ ప్రొడక్షన్స్' శుక్రవారం ప్రకటించింది. అయితే సినిమాలో రుక్మిణి ఎవరు? అనే ప్రశ్నకు అక్టోబర్ 13న సమాధానం చెబుతామని మేకర్స్ ఆసక్తి పెంచారు. ఈ సినిమాను ప్రముఖ హీరో నాని సమర్పిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఈ వీడియోలో నాని, దర్శకుడు మురళీ కాంత్ సినిమా కథ గురించి మాట్లాడుకుంటున్నట్లు చూపించారు. ఇది కృష్ణుడి కథ అని దర్శకుడు చెప్పగానే నాని ఆసక్తిగా వింటాడు. అయితే గ్లింప్స్‌లో కనిపించిన పుస్తకాలన్నీ రుక్మిణి రాసినవేనని తెలుసుకుని.. "ఈ రుక్మిణి ఎవరు?" అని అడుగుతాడు. అప్పటివరకు నిద్రపోతున్న నితిన్ మేల్కొని "రుక్మిణి నా భార్య" అని చెప్పడంతో గ్లింప్స్ ముగుస్తుంది. ఈ సినిమా తొలి షెడ్యూల్ షూటింగ్ సెప్టెంబర్‌లో పూర్తయింది. పది రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో నితిన్‌తో పాటు సాయికుమార్, హర్షవర్ధన్, ఇతర ముఖ్య నటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. సాంకేతికంగా కూడా ఈ సినిమాకు మంచి బృందం పనిచేస్తోంది. జోమోన్ టీ.జాన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. రేఖ బొగ్గరపు కాస్ట్యూమ్స్ బాధ్యతలు చూస్తున్నారు. రమణ మాధవరం సహదర్శకుడిగా పనిచేస్తున్నారు. టైటిల్ గ్లింప్స్‌ను పంచుకున్న నితిన్.. ఈ సినిమా ప్రేక్షకుల మనసులను నేరుగా తాకుతుందని ఆసక్తికరంగా వ్యాఖ్యానించాడు. ఇప్పటికే టైటిల్‌తో ఆసక్తి రేపిన ఈ సినిమా నుంచి అక్టోబర్ 13న ఎలాంటి వివరాలు వెల్లడవుతాయో చూడాలి.



# పవన్ కల్యాణ్ అంటే చిన్నప్పటి నుంచి క్రేజ్: ఆనంది



తెలుగు, తమిళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆనంది.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనే తన క్రష్ అని ఆమె తన మనసులోని మాటను వెల్లడించారు.తన తాజా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆనంది మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా, మీకు ఇష్టమైన హీరో ఎవరు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు. "చిన్నప్పటి నుంచి నాకు పవన్ కల్యాణ్ గారంటే ఎంతో ఇష్టం. నిజం చెప్పాలంటే చిన్నతనం నుంచే ఆయనే నా క్రష్" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు.

పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోందంటే చాలు, తమ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. వెండితెరపై ఆయన ప్రదర్శించే విలక్షణమైన మ్యానరిజమ్స్, స్టైల్‌ను తాను ఎంతగానో ఇష్టపడతానని తెలిపారు. నటిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తర్వాత కూడా పవన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

# 'బాహుబలి'ని మించిన ప్రయోగం.. వారణాసి కోసం ప్రత్యేక భాష సృష్టిస్తున్న జక్కన్న?

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తన సినిమాల్లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇప్పుడు మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న వారణాసి కోసం మరో ఆసక్తికర ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా ఓ కల్పిత భాషను రూపొందిస్తున్నారట. అంతేకాదు.. ఆ భాషకు సొంత లిపి, వ్యాకరణ నియమాలు కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది.

ఈ సినిమాలో మహేశ్‌బాబుతో పాటు ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'వెరైటీ' కథనం ప్రకారం.. సినిమాలోని ఓ కీలక సన్నివేశంలో ప్రధాన పాత్రలు ప్రాచీన లిపి ఉన్న ఓ గుహలోకి వెళ్తాయి. అక్కడి గోడలపై ఉన్న రాతల్లోని రహస్యాన్ని ఛేదించాలంటే వారికి ఆ కొత్త భాషను అర్థం చేసుకోవాల్సి ఉంటుందట. కథలో ఈ భాష కీలక పాత్ర పోషించనుందని సమాచారం.'బాహుబలి: ది బిగినింగ్' సినిమాలోనూ రాజమౌళి కల్పిత భాషను ఉపయోగించిన విషయం తెలిసిందే. గేయ రచయిత, రచయిత మదన్ కార్కీ సహకారంతో రూపొందించిన 'కిలికి' భాషను ఆ సినిమాలో కాలకేయులు మాట్లాడారు. అయితే 'వారణాసి'లో ఈ భాషకు మరింత ప్రాధాన్యం ఉండనుందని తెలుస్తోంది. పదాలు, వాక్య నిర్మాణం, లిపి సహా పూర్తి భాషను అభివృద్ధి చేయడానికి ఓ భాషా నిపుణుడిని నియమించినట్లు కథనాలు చెబుతున్నాయి.

ఇక ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా సుమారు 120 దేశాల్లో, 50 భాషల్లో విడుదల చేయాలని రాజమౌళి భావిస్తున్నట్లు గతంలో 'మిడ్ డే' కథనం వెల్లడించింది. ఇందుకోసం దాదాపు 1,500 మంది వాయిస్ ఆర్టిస్టులకు ఆడిషన్లు నిర్వహించే ఆలోచనలో ఉన్నారట. ఏఐతో రూపొందించిన స్వరాల కంటే నటీనటుల భావోద్వేగాలను ప్రతిబింబించే మనుషుల గొంతులకే ఆయన ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. వారణాసి చిత్రం 2027 ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.





# ఆ విమర్శలు పట్టించుకుంటే భయంతో ఆగిపోయేదాన్ని

బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ సోషల్ మీడియా ట్రోలింగ్, బాడీ షేమింగ్‌పై ఘాటుగా స్పందించారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రతికూల వ్యాఖ్యలకు భయపడితే జీవితంలో ముందుకు సాగలేమని ఆమె అన్నారు. లండన్‌లో తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడి జననం తర్వాత ఇటీవల కత్రినా తొలిసారిగా బయట కనిపించినప్పుడు, సోషల్ మీడియాలో ఆమె శరీరాకృతిపై కొందరు నెగటివ్ కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె స్పందించారు. "సోషల్ మీడియాలో వచ్చే మాటలు మన ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపకుండా చూసుకోవాలి. ప్రతి ఒక్కరి కామెంట్లను పట్టించుకుంటూ పోతే, మనకోసం మనం నిర్ణయాలు తీసుకోలేం. ప్రతి విమర్శకు నేను స్పందించి ఉంటే, భయంతో అక్కడే స్తంభించిపోయేదాన్ని" అని కత్రినా వివరించారు.

కొన్నిసార్లు ప్రపంచం మనల్ని ప్రశంసిస్తుందని, మరికొన్నిసార్లు మనకు మనమే ధైర్యం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆమె పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో కత్రినా ఓ బాబుకు జన్మనిచ్చారు. ఆ తర్వాత ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఆమెపై బాడీ షేమింగ్ కామెంట్లు వచ్చాయి. ఈ ఘటన జరిగిన కొన్ని వారాల తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

